ఊరెళ్తున్నారా.. మాకు చెప్పండి

● బంజారాహిల్స్ పోలీసుల సూచన ● సంక్రాంతికి స్వీయ జాగ్రత్తలు తప్పనిసరి





బంజారాహిల్స్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అసలే పండుగ.. ఆ పై వారాంతాలు.. సంక్రాంతికి నాలుగు రోజుల ముందే నగరవాసులు ఊరెళ్లిపోతున్నారు. పెట్టే బేడ సర్దేసి ఇంటికి తాళం వేస్తున్నారు. ఇదే సమయంలో దొంగలు చొరబడతారని మరిచిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఊరెళ్లే వారు తమకు సమాచారం ఇవ్వాలని, స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ సూచించారు. పోలీసులు తీసుకుంటున్న జాగ్రత్తలను వివరించారు. ప్రతీ నిత్యం చోరీలు జరిగే కొన్నిప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి గస్తీని ముమ్మరం చేస్తున్నామని, సిబ్బందికి అదనపు బాధ్యతలను అప్పగించామని తెలిపారు. సెక్టారు వారీగా ఎస్సైలను అప్రమత్తం చేయడంతో క్రైం టీం బలగాలు నిరంతం గస్తీ తిరుగుతాయని, గంటకోసారి పెట్రోలింగ్ నిర్వహించేలా ఏర్పాటు చేశామని చెప్పారు. జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీసులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు.

ఈ జాగ్రత్తలు పాటించండి...

- ఊరెళ్లే వారు ఠాణాలో తమ పూర్తి వివరాలను అందించాలి. అలా ఇచ్చివెళ్లే వారి ఇళ్లపై ప్రత్యేక దృష్టి పెడతాం.
- ఇంట్లో ఎలాంటి విలువైన ఆభరణాలు విడిచి వెళ్లరాదు. ఒకవేళ ఉంటే బ్యాంక్ లాకర్‌లో పెట్టి వెళ్లడమో లేదంటే తమ వెంట తీసుకువెళ్లడమో చేయాలి.
- ఇంటి యజమానుల చుట్టుపక్కల వారికి చెప్పి వెళ్లడం మంచిది. వారు కూడా కొంత దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది.
- సీసీ కెమెరాలు ఉంటే అవి పనిచేస్తున్నాయా లేదా అనేది సరిచూసుకోవాలి. లేని వారు ఏర్పాటు చేసుకుంటే మేలు.
- ద్విచక్ర వాహనాలు ఉంటే ఇంటి లోపల పెట్టుకోవాలి.
- ఇంటి లోపల విద్యుత్ సరఫరాను నిలిపేసి వెళ్లాలి. షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలను నివారించవచ్చు.
- వీలైతే ఇంటి లోపలగాని, బయటగాని సీసీ కెమెరాను ఏర్పాటు చేసుకోవాలి. ఒకవేళ దొంగతనం జరిగినా నిందితులను పట్టుకునే అవకాశాలుంటాయి.
- ఎవరైనా దొంగలను గుర్తిస్తే వెంటనే ఠాణాలో సమాచారం ఇవ్వవచ్చు. ఏ ఇబ్బంది ఎదురైనా 100కు లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి.



ఏటీఏఈఈ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పనిచేయాలి

పంజాగుట్ట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న ఇంజనీర్లు, ఉద్యోగులు, సిబ్బంది ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా బాధ్యతతో పనిచేయాలని రాష్ట్ర మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం సచివాలయంలో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్(ఏటీఏఈఈ)-2024 డైరీని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి సంతోష్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు అనిల్ సాగర్, నాయకులు వంశీధర్‌గౌడ్, మనోహర్‌బాబు, మహ్మద్‌గౌస్, రాఘవేంద్ర, సిద్ధార్థ, ఎస్.ఎల్.శ్రీనివాస్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్‌గా ప్రదీప్‌కుమార్

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్‌గా ఎస్.వి.ప్రదీప్ కుమార్‌శెట్టి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత డైరెక్టర్ డాక్టర్ బి.ప్రభాకర్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ ఉద్యోగుల సహకారంతో హెచ్ఎండీఏ ప్రాముఖ్యతను పెంచేందుకు కృషి చేస్తానని ఎస్.వి.ప్రదీప్ కుమార్ శెట్టి తెలిపారు.

పతంగుల తయారీపై శిక్షణ

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నేపథ్యంలో మనకు నచ్చిన డిజైన్‌లో గాలిపటాలు తయారు చేసుకోవచ్చునని అంటోంది సింప్లీ నామ్‌ధారీ. ఇందుకోసం 5 నుంచి 12 సంవత్సరాల లోపు పిల్లల కోసం జనవరి 13న బంజారాహిల్స్‌లోని తమ స్టోర్‌లో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వర్క్‌షాప్‌లో గాలిపటాల తయారీలో శిక్షణ ఇవ్వడంతో పాటు బహుమతులను కూడా గెలుచుకునే అవకాశం ఉందని తెలిపారు. వివరాలకు 63022 41108కు కాల్ చేయవచ్చని వారు తెలిపారు.



నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ఏపీ ముఖ్య కార్యదర్శి సునీత, తదితరులు

పీపుల్స్‌ప్లాజాలో నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో - గాంధీ బంకర్ మేళా

ఖైరతాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కళాకారులు తాము తయారు చేసిన ఉత్పత్తులను నేరుగా విక్రయించేందుకు అవకాశం కల్పిస్తూ పీపుల్స్‌ప్లాజాలో బుధవారం జాతీయ చేనేత ఎక్స్‌పో - గాంధీ బంకర్ మేళా పేరిట ప్రదర్శన ప్రారంభమైంది. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు పది రాష్ట్రాల నుంచి చేనేత సహకార సంఘాలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నాయి. ప్రదర్శనను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి (చేనేత, జౌళి శాఖ) కె.సునీత ఆ శాఖ కమిషనర్ ఎంఎం నాయక్‌తో కలిసి ప్రారంభించారు. 120 చేనేత సహకార సంఘాలు ప్రదర్శనలో స్టాళ్లను ఏర్పాటు చేయగా, అందులో 55 ఆంధ్రప్రదేశ్‌కు, 20 తెలంగాణ రాష్ట్రానికి చెందినవి ఉన్నాయి. సునీత మాట్లాడుతూ ఒకే వేదికపై దేశవ్యాప్త చేనేత ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న ఈ ఎక్స్‌పోకు నగరంలో మంచి ఆదరణ ఉంటుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రదర్శనలో పొందూరు ఖాదీ, బందర్ చీరలు, వెంకటగిరి చీరలు, ఉప్పాడ చీరలు, బెంగాలీ కాటన్ చీరలు, చందేరీ, బగల్‌పూర్, చీరలు, ఎమ్మిగనూరు బెడ్‌షీట్స్, ఎన్నో రాష్ట్రాలకు చెందిన డ్రెస్ మెటీరియళ్లు, లేపాక్షి హస్తకళలు తదితర ఎన్నో రకాల స్టాళ్లు సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. గాంధీ బంకర్ మేళా దేశ వ్యాప్తంగా నైపుణ్యం కలిగిన కళాకారుల జీవనోపాధికి మద్దతిచ్చే ప్రదర్శన అని, దీనిని అందరూ అదరించాలని చేనేత, జౌళి పరిశ్రమల శాఖ అధికారులు తెలిపారు.



ఆపరేషన్ స్మైల్ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

బాల కార్మికులకు మంచి భవిష్యత్ ఇవ్వాలి

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను గుర్తించి వాళ్లను తిరిగి బడిలో చేర్పించి మంచి భవిష్యత్ ఇవ్వాల్సిన సామాజిక బాధ్యత అందరిపై ఉందని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆపరేషన్ స్మైల్-10పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్, కార్మిక, రెవెన్యూ వైద్యఆరోగ్య శాఖ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి బాల కార్మికులను వెంటనే విడుదల చేయించాలని సూచించారు. స్మైల్ ఆపరేషన్ విజయవంతం కావాలంటే పిల్లలు ఎక్కడ కనిపించినా వెంటనే 1098 ఫోన్ నెంబర్ ద్వారా సీడబ్ల్యూసీకి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్డీవో సూర్యప్రకాష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శైలజ, కార్మిక శాఖ అధికారి శ్యాంసుందర్, జిల్లా అభివృద్ధి అధికారి అక్కేశ్వరరావు, డీఐఓ శ్రీకళ, డీఈవో రోహిణి, ఎన్జీవోలు, జువైనల్ హోం, ప్రభుత్వ చైల్డ్‌హోం అధికారులు పాల్గొన్నారు.



స్మార్ట్‌వార్డు సిస్టం ప్రారంభోత్సవంలో ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, వైద్యులు

రాష్ట్రంలోనే తొలిసారిగా 'కిమ్స్'లో స్మార్ట్‌వార్డు

రాయదుర్గం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో స్మార్ట్‌వార్డు సిస్టంను డోజీ టెక్నాలజీ కంపెనీ భాగస్వామ్యంతో అందుబాటులోకి తీసుకొచ్చామని డాక్టర్ సుధీర్ తెలిపారు. ఈ టెక్నాలజీ సహకారంతో రోగుల సంరక్షణ మరింత సులువవుతుందన్నారు. ఎన్‌హ్యాండ్స్ సేఫ్టీవింగ్ ప్రోగ్రామ్‌తో డోజీ టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కాంటాక్ట్‌లెస్ రిమోట్ పేషెంట్ మానిటరింగ్, ఎర్లీ వార్నింగ్ సిస్టమ్(ఈడబ్ల్యూఎస్) రోగి ఉన్న బెడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా రోగి పల్స్, హార్ట్‌బీట్, శ్వాస ఎప్పటికప్పుడు ఈ టెక్నాలజీ ద్వారా గుర్తించి డాక్టర్లు, నర్సులకు ఎప్పటికప్పుడు అందజేస్తాయన్నారు. దీంతో పేషెంట్ పర్యవేక్షణ. భద్రత, క్లినికల్ ఫలితాలు మెరుగుపడతాయన్నారు. కిమ్స్ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు మాట్లాడుతూ.. చికిత్సకు ఈ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. డోజి సంస్థ సీఈవో, సహవ్యవస్థాపకులు ముదిత్ దండువాటే మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ధరణి ఎత్తివేయాలి : వీహెచ్

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ధరణితో ధనవంతులకే లాభమని, దానిని ఎత్తివేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు అన్నారు. ధరణిపైన అధ్యయన కమిటీ వేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన భూములు.. ధరణి పోర్టల్ వల్ల అన్యాక్రాంతం అయ్యాయన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర డైరీని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపా దాస్ మున్షీ ఆవిష్కరించారు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంఏ రెహమాన్ సూఫీ, జనరల్ సెక్రటరీ బీవీ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లను పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగించాలి

● ఉప సర్పంచ్‌లకు జాయింట్ చెక్ పవర్ తీసేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

పంజాగుట్ట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం సర్పంచ్‌లను వివిధ రకాలుగా వేధించిందని, చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో 13 మంది ఆత్మహత్య చేసుకున్నారని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సౌధాని భూమన్న యాదవ్ అధ్యక్షతన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కేసీఆర్ పాలనలో సర్పంచ్‌ల అప్పులు, ఆత్మహత్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, ఉప సర్పంచ్‌లకు జాయింట్ చెక్ పవర్ రద్దు చేయాలని, ఎన్నికలు అయ్యే వరకూ ప్రస్తుతం ఉన్న సర్పంచ్‌లను పర్సన్ ఇన్‌చార్జిగా నియమించాలని పలువురు సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. **గత ప్రభుత్వం సర్పంచ్‌లను వెట్టి కార్మికులుగా మార్చిందని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు.** సర్పంచ్‌ల సమస్యలు, డిమాండ్లను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్తానని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి పేర్కొన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు జూలూరి ధనలక్ష్మి, మల్లేష్, బీర్ల శంకర్, స్వప్న, సురేందర్, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖలో అవినీతిపై విచారణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ యుగంధర్‌గౌడ్

బర్కత్‌పుర, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అక్రమ ప్రమోషన్లతో పాటు ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా కూర్చోబెట్టి జీతాలు ఇచ్చారని, దీనిపైనా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు చెందిన 636 మంది ఉద్యోగులు ఏపీలో పని చేస్తున్నారని, వారిని బదిలీ చేయాలని ఏపీ సీఎం ఆమోదించినా అప్పటి సీఎం కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. వారందరినీ బేషరతుగా తెలంగాణకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ శాఖలో గత ప్రభుత్వ హయాంలో జనరల్ బదిలీలు లేవని, డబ్బులు ఎవరు ఇస్తే వారు కోరిన చోటుకు బదిలీ చేశారని ఆరోపించారు. 49 మందికి ప్రమోషన్లు ఇచ్చి బదిలీ చేశారని, వీరిలో 12 మందికి పోస్టింగ్‌లు ఇచ్చి మిగతా 37 మందికి 10 నెలలపాటు కూర్చోబెట్టి వేతనాలు చెల్లించారని ఆయన ఆరోపించారు. అదేవిధంగా 31 మంది ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లను అక్రమంగా బదిలీ చేశారన్నారు. ఎంపీ సంతోష్‌కుమార్ అనుచరుడికి జూబ్లీహిల్స్‌లో టెండర్ లేకుండా వైన్‌షాపు కేటాయించారని, ఇందుకోసం ప్రత్యేక జీవో తెచ్చారని ఆరోపించారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విచారణ జరిపిస్తే అనేక వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు ప్రసాద్, శివకుమార్, జగన్, వెంకట్‌గౌడ్, శేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మారుతీనగర్‌లో పది ఇంచుల పైపులైన్ వేయాలి



మారుతీనగర్‌వాసులతో మాట్లాడుతున్న విజయారెడ్డి

ఖైరతాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మారుతీనగర్‌లో పది ఇంచుల పైప్‌లైన్ వేయాలని కార్పొరేటర్ విజయారెడ్డి అధికారులకు సూచించారు. ఇక్కడ కొన్ని రోజులుగా జరుగుతున్న పనుల్లో కొంత మేరకు 10 ఇంచుల మెయిన్ పైప్‌లను వేసి అనంతరం 8 ఇంచుల పైప్‌లను వేస్తున్నారని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం ఆమె జలమండలి మేనేజర్ నదీమ్‌తో కలిసి పనులను పరిశీలించి లెవెల్స్ కలవనందున పూర్తిస్థాయిలో 10 ఇంచుల పైప్‌లైన్ వేయాలని, ఈ మేరకు అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పనులను త్వరగా పూర్తి చేసి స్థానికులకు ఇబ్బందులు లేకుండా చేయాలని అధికారులకు విజయారెడ్డి సూచించారు.

యూనివర్సిటీ భూములు హైకోర్టుకు వద్దు

● జీవో.55ను వెంటనే వెనక్కి తీసుకోవాలి : ఝాన్సీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ

పంజాగుట్ట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయానికి చెందిన వందెకరాల భూమిని హైకోర్టు భవన నిర్మాణానికి కేటాయించవద్దని, ప్రభుత్వం విడుదల చేసిన జీవో.55ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర యూనివర్సిటీల కన్వీనర్ జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు పృథ్వీతేజ, కళ్యాణిలతో కలిసి ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వవిద్యాలయానికి చెందిన భూములను ఇష్టారీతిన పలు సంస్థలకు కట్టబెడుతోందని ఆరోపించారు. హైకోర్టు భవన నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, నగరం చుట్టుపక్కల ఎన్నో భూములు, గత ప్రభుత్వం కబ్జా చేసిన భూములు ఉన్నాయని వాటిలో కట్టుకోవాలని సూచించారు. ఏ ప్రభుత్వాలు కూడా విద్యాసంస్థలకు కాకుండా ఇతర సంస్థలకు భూమిని కేటాయించలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించే నిర్ణయం వెనక్కి తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

12 నుంచి ఐటీసీఎల్ పోటీలు



ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్ లీగ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేణు

పంజాగుట్ట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ ప్రియులు ఎంతో ఉత్సాహంగా వీక్షించే ఐపీఎల్ పోటీల లాగానే దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ సహకారంతో ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్ లీగ్(ఐటీసీఎల్) పోటీలు జరగనున్నాయి. ఈ నెల 12 నుంచి మూడు రోజులపాటు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగే ఈ పోటీల్లో 12 జట్లు పాల్గొంటాయని ప్రముఖ మెజీషియన్, శ్రీనగర్ టీమ్ యజమాని సామల వేణు తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో డైరెక్టర్లు సీహెచ్.సుప్రియ, ఎం.గిరిబాబు, ఐటీ హెడ్ మకరంద్ లొంకార్‌లతో కలిసి పోటీల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రపంచవ్యాప్తంగా తైక్వాండో ఆటకు మంచి ప్రాముఖ్యం ఉందన్నారు. పోటీలను యూఏఈకి చెందిన ప్రముఖ సింగర్ అహ్మద్ హోసాని ప్రారంభిస్తారని, ముగింపు వేడుకలో యూఏఈకి చెందిన అబ్దుల్లా గ్రూపు ఆఫ్ కంపెనీస్ చైర్మన్ డాక్టర్ బూ అబ్దుల్లా, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి, పారిశ్రామికవేత్త కవితశ్రీనివాసన్, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

అయోధ్య రాములవారి వెండి పాదుకలకు ప్రత్యేక పూజలు



పాదుకలను మోసుకొస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట/ యాకుత్‌పుర, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా శృంగేరి పీఠం నుంచి శ్రీరామామృత తరంగిణి పేరిట 16 నదుల ఇసుక, పుణ్య తీర్థాలతో రాములోరికి సమర్పించే వెండి పాదుకలను లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదుకలకు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి బి.మారుతీ యాదవ్, ప్రచార కార్యదర్శి ఎ.వినోద్‌కుమార్, గడ్డం రవి స్వాగతం పలికారు. భక్తులు పాదుకలను దర్శించుకోవడానికి పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ సి.రాజేందర్‌యాదవ్, మాజీ చైర్మన్లు కె.విష్ణుగౌడ్, సి.రాజ్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సిద్ధి వినాయక ఆలయంలో కుటుంబ సభ్యులతో హోమంలో పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

హనుమాన్ ఆలయ ఆదాయం రూ. 6,03,615



హుండీలు లెక్కిస్తున్న అర్చక సిబ్బంది

అమీర్‌పేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని హనుమాన్ ఆలయం హుండీలను బుధవారం లెక్కించారు. 93 రోజులకు సంబంధించి 10 హుండీల ద్వారా రూ. 6,53,905 ఆదాయం వచ్చినట్లు ఈవో విఠలయ్య వెల్లడించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి సమక్షంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం 5 గంటలకు ముగిసింది. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సతీష్, సిబ్బంది లక్ష్మీమణి, వెంకట్రావ్, అర్చకులు నరహరి శర్మ, నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

ఎర్రగడ్డ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. బుధవారం ఎర్రగడ్డకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు జావిద్ సుల్తాన్‌నగర్ బస్తీలో తాగునీటి పైప్‌లైన్ వేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలపై అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు డి.సంజీవ, నాయకులు మహ్మద్ అజీమ్, మహ్మద్ సర్దార్, జావెద్, సయ్యద్ రసూల్, బాబు జానీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ కిషోర్ కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కేవీ గణేశ్‌నగర్, మోతిలాల్‌నగర్ ఫీడర్ల పరిధి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ అవంతి నగర్, ఎయిర్‌పోర్ట్ హంగర్స్, ఎన్‌బీటీనగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలో..

బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 11కేవీ సాయి ఎన్‌క్లేవ్, ప్రగతినగర్ ఫీడర్ల పరిధి, మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల వరకు 11కేవీ బంజారాహిల్స్ రోడ్ నెంబర్.12, నాగార్జుననగర్ ఫీడర్ల పరిధి, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ శ్రీరామ్‌నగర్, ఇంజనీర్స్‌కాలనీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

రైలుకు ఎదురుగా వెళ్లి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రైలుకు ఎదురుగా వచ్చి దాని కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన డబిల్‌పుర రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. డబిల్‌పుర రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి రైలుకు ఎదురుగా ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాల్లో అవకాశాలు ఇప్పిస్తానంటూ మోసం

యూసుఫ్‌గూడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సినిమాల్లో అవకాశాలు ఇప్పిస్తానని ఓ వ్యక్తి మోసం చేశాడని ఏపీకి చెందిన యువతి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ వినుకొండ ప్రాంతానికి చెందిన ఓ యువతి మేకప్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తూ రెహ్మత్‌నగర్‌లో నివాసం ఉంటుంది. గతేడాది వినుకొండకు బస్సులో బయలు దేరగా, అదే బస్సులో ఎక్కిన జొన్నలగడ్డ రాజుతో పరిచయం ఏర్పడింది. ఒక టీవీలో వచ్చే కామెడీ ప్రోగ్రామ్‌లో జూనియర్ ఆర్టిస్టునంటూ పరిచయం చేసుకున్నాడు. తనకు ఇండస్ట్రీలో మంచి పరిచయాలు ఉన్నాయని, మంచి అవకాశాలు ఇప్పిస్తానని చెప్పాడు. అనంతరం ఊరి నుంచి మళ్లీ నగరానికి వచ్చిన తర్వాత ఆమెతో అనేక సార్లు శారీరకంగా కలిశాడు. ఆమె నుంచి రూ.50 వేలు తీసుకున్నాడు. కొన్ని రోజుల క్రితం ఓ మహిళ యువతికి ఫోన్ చేసింది. నా భర్త రాజుతో శారీరక సంబంధం ఎందుకు పెట్టుకున్నావని బెదిరించింది. నీతో మాట్లాడాలి సికింద్రాబాద్ రావాలని చెప్పింది. అక్కడకు వెళ్లిన యువతి ఫొటోలు, ఆధార్‌కార్డు తీసుకుని ఎవరికైనా చెప్పావంటే చంపేస్తామని బెదిరించారు. దీంతో తాను మోసపోయానని తెలుసుకున్న యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గుంతలమయంగా రోడ్లు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

బోయినపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రాంతాల్లోని రోడ్లు పెద్దపెద్ద గుంతలు పడి అధ్వానంగా మారాయి. నడవడానికి వీలులేకుండా తయారయ్యాయి. కంటోన్మెంట్ 6వ వార్డు పరిధిలోని సీతారాంపురానికి వెళ్లే రోడ్డు స్పెన్సర్ సూపర్ మార్కెట్, మహాత్మనగర్, బోయినపల్లి మార్కెట్లలో రోడ్లపైన ప్రయాణం నరకమేనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గుంతలరోడ్లను బాగుచేయాలని ప్రజలు, ప్రయాణికులు వేడుకుంటున్నా కనీసం మరమ్మతులకు చర్యలు తీసుకోలేదు.


సీతారాంపురానికి వెళ్లే రహదారిలో ఏర్పడిన గుంతలు

దీనికి తోడు గతంలో కురిసిన వర్షానికి రోడ్లు మరింత దారుణంగా మారాయి. రామన్నకుంట చెరువుకట్ట వద్ద ప్రధానరోడ్డు, రోడ్డుపైన అడుగుకోగుంత ఏర్పడింది. దీంతో ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. దీంతో రాత్రి సమయాల్లో ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇచ్చే అవకాశం లేదని ప్రయాణికులు అంటున్నారు. ద్విచక్రవాహనదారులు రోడ్డు దిగి రోడ్డు ఎక్కే క్రమంలో కిందపడి గాయాలపాలవుతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. స్పెన్సర్ సూపర్ మార్కెట్ వద్ద ఉండే రోడ్డు జీహెచ్ఎంసీ, కంటోన్మెంట్ బోర్డుల పరిధిలోకి రాదంటూ ఎవరికి వారే తమ పరిధిలో లేదని ఆ రోడ్డు తమది కాదంటే తమది కాదని అధికారులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కాలంగడుపుతూ వస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే పరిస్థితి నెలకొన్న సమయాల్లో బోర్డు బీఆర్ఎస్ సభ్యుడు పాండుయాదవ్ స్పందించి అక్కడ తన సొంత నిధులతో సిమెంట్ వేయించి మరమ్మతులు చేయించారు. కానీ ప్రస్తుతం పట్టించుకునే నాయకుడు గానీ, అధికారులు గానీ కరువయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే ఈ ప్రాంతంలోని రోడ్లకు మరమ్మతులు చేయించాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.


బోయినపల్లి స్పెన్సర్ సూపర్ మార్కెట్ వద్ద కంకర తేలిన రోడ్డు

అదుపు తప్పితే అంతే సంగతి..



ఇక్కడి రోడ్డు పూర్తిగా పాడై ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి జారిపడేలా ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందని సంబంధిత అధికారులు వీలైనంత త్వరితగతిన రోడ్లకు మరమ్మతులు చేయాలి.

- వెంకటేశ్, కాలనీవాసి

దుమ్ము ధూళి లేస్తూ ఇబ్బందికరంగా మారింది



సీతారాంపురానికి వెళ్లే రహదారిలో రోడ్లు గుంతలుగా ఏర్పడి కంకర పైకి తేలింది. దీంతో ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్న సమయంలో దుమ్ము ధూళి పైకి వెదజల్లుతూ శ్వాస తీసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో చాలా ఇబ్బందులు వస్తున్నాయి. రోగాలపాలు కావడం జరుగుతోంది. ఈ రహదారిపై సిమెంట్ రోడ్డు వేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి.

- రాజు, స్థానికుడు


రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి తదితరులు

కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. తార్నాకలోని హనుమాన్‌నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం డిప్యూటీ మేయర్ పరిశీలించారు. అనంతరం కాలనీవాసుల సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటించేవిధంగా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్గనైజింగ్ కార్యదర్శి ముత్యాలు

రైల్వే రక్షకదళ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు

బౌద్ధనగర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రైల్వే రక్షకదళ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. చిలకలగూడలోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం జరిగిన పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. సమస్యల పరిష్కారానికి ఏకతాటిపై కృషి చేయాల్సిన అవసరముందన్నారు. సంబంధిత ఉన్నతాధికారులను ఇటీవలే కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి సమస్యల పరిష్కారంపై వినతిపత్రం అందించినట్లు వివరించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ఆర్‌పీఎఫ్ డబ్ల్యూఏ) అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జీవీఎస్ రాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వీ.ముత్యాలు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మారేడుపల్లి, జనవరి 10(ఆన్‌లైన్) : కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె. రామకృష్ణ బుధవారం మహేంద్రహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి బీజేపీ చేరేందుకు, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీని గెలిపించేందుకు అన్ని రకాల కార్యక్రమాలు చేపడుతున్నట్లు, మల్కాజిగిరి పార్లమెంట్ సీటు ఖచ్చితంగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయానంద్, బీ.ఎన్.శ్రీనివాస్, పరుశురాం పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ ప్రతినిధులతో విద్యార్థులు

పుస్తకాల పంపిణీ

పద్మారావునగర్, జనవరి, 10(ఆంధ్రజ్యోతి) : భోలక్‌పూర్, కృష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్, వ్యవస్థాపక అధ్యక్షుడు వై.సి.సుంకి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని అన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులకు హెచ్ఎం మల్లికార్జునరెడ్డి విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సుధాకర్‌రావు, రఘువర్మ పాల్గొన్నారు.


హనుమాన్ ఆలయంలో హుండీలు లెక్కిస్తున్న అర్చక సిబ్బంది

హుండీల లెక్కింపు

అమీర్‌పేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : అమీర్‌పేటలోని హనుమాన్ ఆలయం హుండీలను బుధవారం లెక్కించారు. 93రోజులకు గాను 10 హుండీల ద్వారా రూ. 6,53,905 ఆదాయం వచ్చినట్లు ఈవో విఠలయ్య వెల్లడించారు. ఇందులో నోట్లు రూ. 6,03,615 కాగా నాణేలు రూ. 50,290 వచ్చాయి. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి సమక్షంలో ఉదయం 10గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం 5గంటలకు ముగిసింది. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సతీష్, సిబ్బంది లక్ష్మి మణి, వెంకట్రావ్, అర్చకులు నరహరిశర్మ, నర్సింహమూర్తి పాల్గొన్నారు.


హనుమాన్ ఆలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

బొల్లారం డౌటన్ బజార్‌లో..

తిరుమలగిరి జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : బొల్లారం డౌటన్ బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన హనుమాన్ ఆలయంలో బుధవారం ఈఓ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. మూడు నెలలకు గాను 50,302 రూపాయల ఆదాయం వచ్చిందని ఈఓ మహేందర్‌రెడ్డి తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని బ్యాంక్‌లో జమ చేస్తామని అన్నారు. దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.


బన్సీలాల్‌పేట్ డివిజన్ కళారంగ్ బస్తీలో చిన్నారులకు టీకాలు ఇస్తున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది.

- పద్మారావునగర్, ఆంధ్రజ్యోతి

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి : రాఘవయ్య

చిలకలగూడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నూతన పెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతిలో పెన్షన్లు ఇవ్వాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య డిమాండ్ చేశారు. నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని మూడు రోజులుగా దేశవ్యాప్తంగా రైల్వే కార్యాలయాలు, వర్క్‌షాపుల వద్ద నిరహార దీక్షలు చేట్టారు. బుధవారం సికింద్రాబాద్, రైల్ నిలయం ఎదుట నిర్వహించిన ముగింపు రిలే నిరహార దీక్షలో మర్రి రాఘవయ్య ప్రసంగిస్తూ పెన్షన్ రాజ్యాంగం కల్పించిన హక్కని శాంతియుతంగా నిరహారదీక్షల ద్వార నిరసన తెలియజేస్తున్నామని పరిష్కరించకపోతే తీవ్ర పరిణామాలకి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. భారతీయ రైల్వేలు దేశ ఆర్థిక వ్యవస్థకి వెన్నుముక వంటిదని, సరుకు రవాణ, ప్రయాణికుల చేరవేతలో ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలిపారు. భారతీయ రైల్వేలో 80వేల కిలోమీటర్ల లైన్లలో, 7వేల రైల్వే స్టేషన్లలో 13లక్షల కార్మికులు, ఉద్యోగులు ప్రతికూల పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారని, విధి నిర్వహణలో ప్రతి రోజు ఇద్దరు కార్మికులు మృతి చెందుతున్నారని గుర్తు చేశారు. విధులు నిర్వహిస్తున్న, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు కూడా న్యాయబద్ధమైన పోరాటానికి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో దమ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రతినిధులు ప్రభాకర్, భరణీ భానుప్రసాద్, షేక్ రవూఫ్, రుద్రారెడ్డి, భుజంగరావు, కె.వీ.ఆర్. ప్రసాద్, అరుణ్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.


రాష్ట్ర మంత్రి సీతక్కను అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలయ్యతో పాటు పలువురు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ప్రజల ప్రభుత్వం కోసం పనిచేస్తున్న మీ సహాయాన్ని ప్రజలు ఎప్పుడు మర్చిపోలేరని, ప్రజాపాలన దరఖాస్తులు తీసుకోవడంలో గానీ తమ నియోజకవర్గం ప్రజలకు చేయూతనివ్వడంలో మీ పాత్ర గొప్పదని అభినందించారు. - అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి

సమస్యల పరిష్కారానికి చర్యలు


ఓపెన్ నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

చిలకలగూడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడుతున్నట్లు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. విజయపురి కాలనీలోని ఓపెన్ నాలాలో సక్రమమంగా నీరు వెళ్లక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన కార్పొరేటర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

‘డబుల్’ ఇళ్లలోకి అక్రమంగా ప్రవేశం

- తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన స్థానికులు

అడ్డగుట్ట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్ ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ బస్తీలో డబుల్ బెడ్రూంలకు ఉన్న తాళాలు పగులగొట్టిన వ్యక్తులపై స్థానికులతో పాటు వివిధ పార్టీల నాయకులు మారేడుపల్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జోగు దశరథ్ మాట్లాడుతూ గతంలో ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ బస్తీలో బీఆర్ఎస్ మాజీ మంత్రులు, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు చేతుల మీదుగా అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేశారు. నాలుగు ఇళ్లకు బినామీ పేర్లు ఉన్నాయంటూ ఆ సమయంలో మంత్రుల ఆధ్వర్యంలో తాళం వేసి ఉంచారు. ఏం జరిగిందో ఏమో గానీ మంగళవారం రాత్రి గుట్టు చప్పుడు గాకుండా బస్తీకి చెందిన కోటేశ్వర్‌రావు, గోవిందమ్మ, సిద్ధయ్య, వేణుగోపాల్ అనే వ్యక్తులు తాళాలు పగులగొట్టారని తహసీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిపై చట్టరీత్యా కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లను పగులగొట్టడం దొంగచాటుగా ఇళ్లలోకి వెళ్లడంతో బస్తీలో ఉద్రిక్తతగా మారింది. ఈ క్రమంలోనే డబుల్ బెడ్రూంల తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లి సామాన్లు భద్రపరుచుకున్న వారిపై తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ముందుగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని ఆ తర్వాత కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో వివిధ పార్టీలకు చెందిన నేతలు ఐలయ్య, భూపతి హరి, అర్జున్‌రావు, యాదగిరి, పరుషరాం, నాగరాజు ఉన్నారు.


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్‌లోని వివిధ పార్టీల నేతలు


అయోధ్య అక్షింతలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

అయోధ్య అక్షింతల పంపిణీ

తిరుమలగిరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : అయోధ్య శ్రీసీతారాముల వారి అక్షింతలను బీజేపీ సీనియర్ నాయకురాలు నాగనేని సరిత తిరుమలగిరి లాల్‌బజార్‌లోని చిన్నమ్మ తోట బస్తీలో ఇంటింటికీ తిరిగుతూ పంపిణీ చేశారు. అలాగే కలశం ఊరేగించారు. బీజేపీ సీనియర్ నాయకుడు మల్లేష్ కలశం తలమీద పెట్టుకుని ఇంటింటికీ తిరుగుతూ శ్రీరాముడి ఆశిష్యులు అందజేశారు. గౌతమ్, రాకేష్ పాల్గొన్నారు.


అయోధ్య అక్షింతలను అందజేస్తున్న నాయకులు

సీతాఫల్‌మండి డివిజన్‌లో..

బౌద్ధనగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : అయోధ్య నుంచి తీసుకువచ్చి న రాముడి అక్షింతలను బుధవారం సీతాఫల్‌మండి డివిజన్‌లో పలు ప్రాంతాల్లో బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. బీజేపీ సికింద్రాబాద్ కన్వీనర్ కందాడి నాగేశ్వర్‌రెడ్డి, ముఖ్య నేత రమేష్‌గౌడ్ తదితరులు అయోధ్య రామమందిరం నుంచి ప్రత్యేక పూజల అనంతరం తీసుకువచ్చిన అక్షింతలతో పాటు రామమందిరం కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు.

అయోధ్య అక్షింతల శోభాయాత్ర నిర్వాహకులపై

కేసులను ఉపసంహరించుకోవాలి

రెజిమెంటల్‌బజార్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన అయోధ్య అక్షింతల శోభాయాత్ర నిర్వాహకులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు చీర శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కేసులు నమోదు అయిన వారికి మార్కెట్ పోలీసులు 41 సీఆర్పీసీ కింద నోటీసులు జారీ చేయడంతో బుధవారం మార్కెట్ పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ రామ జన్మభూమి ట్రస్టు ఇచ్చిన పిలుపు మేరకు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కార్యక్రమానికి డిజే సౌండ్ పెట్టారని, టపాసులు కాల్చారని, ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశారని అన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన అక్షింతల కార్యక్రమంలో ఎక్కడ ఇలాంటి కేసులు నమోదు కాలేదని అన్నారు. గతంలో రాజకీయ మీటింగ్‌లలో డిజేలు వాడితే కేసులు నమోదు చేయని పోలీసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అక్షింతల కార్యక్రమానికి డిజే వాడారని కేసు నమోదు చేయడం బాధకరం అన్నారు. అయినా పోలీసుల సూచనలతో డిజే సౌండ్ తగ్గించి కార్యక్రమం కొనసాగించామని తెలిపారు. కేసులు నమోదు అయిన వారి పట్ల ఎస్ఐ గూండాలు, రౌడీల మాదిరిగా ప్రవర్తించడం దురదృష్టకరం అని అన్నారు. కేసులు ఉపసంహరించకుంటే ఈనెల 13న ధర్నా చౌక్‌లో ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బృహస్పతి, కార్పొరేటర్ కొంతం దీపిక, నరేష్, ప్ర తాప్, మదన్, బాబు, సునీల్ పాల్గొన్నారు. డిజే సౌండ్ నిలిపివేయాలని చెబితే వినకుండా ధర్నా చేస్తామని అనడం, టపాసులు కాల్చడం, రూట్ మార్చడం, సమయపాలన తదితర అంశాలతో పాటు సాధారణ ప్రజలకు అసౌకర్యం కలుగుతుండటం వల్ల కేసులు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.


మీడియాతో మాట్లాడుతున్న చీర శ్రీకాంత్ తదితరులు

బాల కార్మికులకు మంచి భవిష్యత్ ఇవ్వాలి

- హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను గుర్తించి వాళ్లను తిరిగి బడిలో చేర్పించి మంచి భవిష్యత్ ఇవ్వాల్సిన సామాజిక బాధ్యత అందరిపై ఉందని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆపరేషన్ స్మైల్-10పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్, కార్మిక, రెవెన్యూ, వైద్యఆరోగ్య శాఖ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి బాల కార్మికులను వెంటనే విడుదల చేయించాలని సూచించారు. స్మైల్ ఆపరేషన్ విజయవంతం కావాలంటే పిల్లలు ఎక్కడ కనిపించినా వెంటనే 1098 ఫోన్ నెంబర్ ద్వారా సీడబ్ల్యూసీకి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్డీవో సూర్యప్రకాష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శైలజ, కార్మిక శాఖ అధికారి శ్యాంసుందర్, జిల్లా అభివృద్ధి అధికారి అక్కేశ్వరరావు, డీఐఓ శ్రీకళ, డీఈవో రోహిణి, ఎన్జీవోలు, జువైనల్ హోం, ప్రభుత్వ చైల్డ్‌హోం అధికారులు పాల్గొన్నారు.



ఆపరేషన్ స్మైల్ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఉచిత వైద్య శిబిరం

బోయినపల్లి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): బస్తీల్లో నివసించే పేదలకు ఆరోగ్యంపై అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు వీఆర్ ఆస్పత్రి ఎండీ నందకిషోర్ అన్నారు. బుధవారం బోయిన్‌పల్లి మార్కెట్‌యార్డు అంజయ్యనగర్‌లో వీఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, ప్రాంత అధ్యక్షుడు కావేటి మల్లికార్జున్‌యాదవ్ హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 500 మంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకున్నారు. షుగర్, బీపీ, దంత తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు షాహెన్ష, ఆనంద్, గోపాల్ ముదిరాజ్, తోకల వెంకటేశ్, కనకరాజ్‌యాదవ్, వైద్యులు బీంరావు, వీఆర్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో తొలిసారిగా ‘కిమ్స్’లో స్మార్ట్‌వార్డు



స్మార్ట్‌వార్డు సిస్టం ప్రారంభోత్సవంలో ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, వైద్యులు

రాయదుర్గం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో స్మార్ట్‌వార్డు సిస్టంను డోజీ టెక్నాలజీ కంపెనీ భాగస్వామ్యంతో అందుబాటులోకి తీసుకొచ్చామని డాక్టర్ సుధీర్ తెలిపారు. ఈ టెక్నాలజీ సహకారంతో రోగుల సంరక్షణ మరింత సులువవుతుందన్నారు. ఎన్‌హ్యాండ్స్ సేఫ్టీవింగ్ ప్రోగ్రామ్‌తో డోజీ టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కాంటాక్ట్‌లెస్ రిమోట్ పేషెంట్ మానిటరింగ్, ఎర్లీ వార్నింగ్ సిస్టమ్(ఈడబ్ల్యూఎస్) రోగి ఉన్న బెడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా రోగి పల్స్, హార్ట్‌బీట్, శ్వాస ఎప్పటికప్పుడు ఈ టెక్నాలజీ ద్వారా గుర్తించి డాక్టర్లు, నర్సులకు ఎప్పటికప్పుడు అందజేస్తాయన్నారు. దీంతో పేషెంట్ పర్యవేక్షణ, భద్రత, క్లినికల్ ఫలితాలు మెరుగుపడతాయన్నారు. కిమ్స్ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు మాట్లాడుతూ.. చికిత్సకు ఈ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. డోజి సంస్థ సీఈవో, సహవ్యవస్థాపకులు ముదిత్ దండువాటే మాట్లాడారు.

రాములవారి వెండి పాదుకలకు ప్రత్యేక పూజలు


పాదుకలను మోసుకొస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట/ యాకుత్‌పురా, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా శృంగేరి పీఠం నుంచి శ్రీరామామృత తరంగిణి పేరిట 16 నదుల ఇసుక, పుణ్య తీర్థాలతో రాములోరికి సమర్పించే వెండి పాదుకలను లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదుకలకు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బి.మారుతీ యాదవ్, ప్రచార కార్యదర్శి ఎ.వినోద్‌కుమార్, గడ్డం రవి స్వాగతం పలికారు. భక్తులు పాదుకలను దర్శించుకోవడానికి పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ సి.రాజేందర్‌యాదవ్, మాజీ చైర్మన్లు కె.విష్ణుగౌడ్, సి.రాజ్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకు ఎదురుగా వెళ్లి వ్యక్తి ఆత్మహత్య


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ : రైలుకు ఎదురుగా వెళ్లి దాని కిందపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన డబీర్‌పూర రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. డబీల్‌పుర రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి రైలుకు ఎదురుగా ఓ గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని రైల్వే పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.